క్లుప్తంగా

సీసీ రోడ్లకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న దయాకర్‌రెడ్డి

నేలకొండపల్లి: స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతీ ఒక్కరూ సమిష్టిగా పని చేసి విజయం సాధించాలని మండలంలోని నేలకొండపల్లి, అమ్మగూడెం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు శుక్రవారం మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో సమష్టి కృషితో విజయాలు సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు శాఖమూరి రమేష్, గోవిందరావు, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల సత్యనారాయణ, నంబూరి రామారావు, రాయపూడి నవీన్, వెంకన్న, బొందయ్య, బ్రహ్మం, నరేష్, విజయ్‌బాబు పాల్గొన్నారు.

బీసీ భవనాన్ని పూర్తి చేయండి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో బీసీ భవన్ నిర్మాణం అసంపూర్తి దశలో ఉందని తక్షణమే దాన్ని పూర్తి చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం బీసీ హక్కుల సాధన సమితి ప్రతినిధి బృందం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నిలిచిపోయిన బీసీ భవనాన్ని సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో మొదలైన భవన నిర్మాణానికి ఇప్పుడు నిధులు లేక ఆగిపోయిందని, నిధులు మంజూరు చేసి వెంటనే నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు, నాయకులు గాదె లక్ష్మీనారాయణ, నూనె శశిధర్, కనకయ్య, పెనుగుర్తి వెంకటరమణాచారి, వీరయ్య, యాకయ్య, మహేంద్ర, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

రఘునాథపాలెం: మద్యం మత్తులో దాడులు చేసిన వ్యక్తిపై శుక్రవారం రెండు వేర్వేరు కేసులు నమోదైనట్లు స్థానిక ఇన్‌స్పెక్టర్ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. మండలంలోని వి.వెంకటాయపాలెంకు చెందిన ధరావత్ వినయ్ మద్యం మత్తులో తల్లితో ఘర్షణ పడుతున్నాడు. ఈ క్రమంలో అతడి తమ్ముడు పక్క ఇంటి వారిని పిలవడంతో అక్కడికి వెళ్లిన వినాయక్‌పై దాడి చేయడంతో పాటు కుటుంబాన్ని దూషించాడు. దీనిపై వినాయక్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అలాగే మరో సంఘటనలో ఆటో వ్యక్తితో ఘర్షణ పడిన వినయ్ దాని అద్దాలు పగులకొట్టడంతో ఆటో యజమాని బాణోతు మధు ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదైనట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

'శ్రీచైతన్య'లో ఓరియంటేషన్ ప్రోగ్రాం



మాట్లాడుతున్న చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్

ఖమ్మంరూరల్: మండలంలోని పొన్నేకల్‌లో గల శ్రీ చైతన్య కళాశాలలో శుక్రవారం సాంకేతిక పరిజ్ఞానంపై ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ప్రపంచంతో పోటీ పడేలా ముందుకు సాగాలన్నారు. టెక్నికల్ విద్యతో పాటు పరిశ్రమలకు అవసరమైన స్కిల్స్ నేర్పించడం తమ లక్ష్యమని, ఆ దిశగా మైక్రో షెడ్యూల్ తయారుచేసి అమలుచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఈడీ డాక్టర్ సాయిగీతిక, టీసీఎస్, ఇన్ఫోసిస్ టెక్నికల్ హెడ్‌లు జే.వీ.ఆర్ ప్రసాద్, నివాస్, డైరెక్టర్ మల్లెంపాటి విద్య, గోపాల్, వివిధ విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

'చలో మానుకోట'ను జయప్రదం చేయండి

రఘునాథపాలెం: లంబాడీలపై జరుగుతున్న కుట్రలు, అసత్య ప్రచారాలను నిరసిస్తూ ఆదివారం నిర్వహించే మానుకోటలో లంబాడ శాంతి ర్యాలీని జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర లంబాడ ఉద్యోగ జేఏసీ రాష్ట్ర నాయకుడు జాటోత్ భాస్కర్‌నాయక్, జిల్లా లంబాడ జేఏసీ నాయకులు బానోత్ కిషన్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాములుతండాలో బానోతు చంద్రంనాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. లంబాడీలు వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతూ రిజర్వేషన్ల ద్వారా బిడ్డల్ని ఉన్నత చదువులు చదివించుకుంటున్నారన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిన మానుకోట గడ్డమీద నిర్వహించే లంబాడీ బిడ్డల ఆత్మగౌరవ శాంతి ర్యాలీపై లంబాడీ తండాల్లో ప్రచారం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సక్రాం, తౌర్య, రాందాస్, బోడా హట్యా, చందు, స్వామి, బాబురావు, బోడ హుస్సేన్, బానోత్ బిక్షం, ధన సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మల్చింగ్ ట్రెండింగ్



మల్చింగ్ విధానంతో సాగు చేసిన మిర్చి పంట

- కలుపు మొక్కలకు కళ్లెం..
- నీటి ఆదాకు తోడు పెరుగుతున్న దిగుబడి
- కూలీల కొరతకు అధిగమిస్తూ మిర్చి సాగు

ప్రభుత్వ ప్రోత్సాహంతో జిల్లాలో 500 ఎకరాల్లో సాగు

కామేపల్లి: కాలానుగుణంగా వ్యవసాయ సాగు తీరు మారుతోంది. సంప్రదాయ సేద్యాన్ని వీడి ఆధునికతను అందిపుచ్చుకుంటున్న రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతున్నాయి. ముఖ్యంగా మెట్ట పంటల్లో కలుపు నివారణ కోసం మల్చింగ్ షీట్లు వేయడం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు తెగుళ్లు, పురుగుల బెడద తీరి తక్కువ నీటితో పంట చేతికొస్తుంది. యాంత్రీకరణతో అన్నదాత హలం నుంచి దూరమైందని చెప్పవచ్చు. పూర్తిగా యంత్రాలతోనే వ్యవసాయం సాగు దూసుకెళ్తుంది. ముఖ్యంగా మెట్ట పంటల్లో కలుపు మొక్కల నివారణకు మల్చింగ్ విధానంతో చెక్ పెడుతుందని భావించి దీని ప్రయోజనాలు తెలుసుకున్న రైతులు ఈ విధానం వైపు మొగ్గు చూపుతున్నారు.

బహుళ ప్రయోజనాలు..

మెట్ట పంటల్లో మల్చింగ్ షీట్ల విధానంతో రైతులకు బహుళ ప్రయోజనాలున్నాయి. నీరు ఆదా నుంచి మొదలు చీడపీడల నిర్మూలన, 80 శాతం వరకు కలుపు నివారణ వంటి లాభాలు చేకూరుతున్నాయి. షీట్ కింద గడ్డి మొలిచినా సూర్య కిరణాలు పడక షీట్ కిందే మగ్గిపోతుంది. డ్రిప్ వల్ల సాగు నీరు 50 శాతం వరకు ఆదా అవుతుంది. భూమిలో తేమ శాతం ఎక్కువ రోజులు ఉంటుంది. ఎరువులు నేరుగా కాకుండా డ్రిప్ ద్వారా వేస్తాం కాబట్టి వేసిన ఎరువులు సక్రమంగా వినియోగం అవుతాయి. భారీ వర్షాలు పడినప్పుడు కూడా మొక్కలు నీరు పట్టిపోయి చనిపోకుండా నివారించవచ్చు. భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. పంటలో దిగుబడి సైతం భారీగా పెరుగుతుంది.

5,600 ఎకరాల్లో సాగు

మల్చింగ్ షీట్లు వినియోగంతో జిల్లాలో 5600 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహంతో డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేస్తుంది. అదే విధంగా 1,250 ఎకరాలకు మల్చింగ్ షీట్లకు సబ్సిడీ ఇస్తుండడంతో రైతులు మరింత సాగు చేపట్టేందుకు అవకాశం ఉండనుంది.

ఆసక్తి పెరిగింది..



గతంలో కంటే ఈ ఏడాది మల్చింగ్ విధానంపై రైతుల ఆసక్తి పెరిగింది. డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్‌కు ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుండడంతో వందల ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరిగింది. తక్కువ ఖర్చుతో రైతులు ఎక్కువ ప్రయోజనం కలగడం, కలుపు నివారణ, కూలీల సమస్యను అధిగమిస్తున్నారు. దిగుబడి ఎక్కువగా వస్తుండడం, తక్కువ నీటితో ఎక్కువ సాగు వంటి ఇతర ప్రయోజనాలతోనే అన్నదాతలు మొగ్గు కనబరుస్తున్నారు.

– ఆకుల వేణు, వైరా డివిజన్ ఉద్యాన అధికారి

ఐదెకరాల్లో సాగు చేపట్టా..



ప్రతి ఏటా మల్చింగ్ విధానంతో మిరప పంట సాగు చేస్తాను. మల్చింగ్ వేయడం ద్వారా కూలీల సమస్యను అధిగమించవచ్చు. పెట్టుబడి కూడా సగానికి సగం తగ్గుతుంది. పంట ఎదుగుదల కూడా ఆశాజనకంగా ఉండి పంట దిగుబడి పెరుగుతుంది. దీంతో ఈ ఏడాది ఐదెకరాల్లో మల్చింగ్ విధానంతో మిరప సాగు చేశాను. ప్రభుత్వం అందించిన డ్రిప్ విధానంతో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశాను.

– బానోత్ దీనూ, రేపల్లేవాడ

కూలీలు, సామగ్రికి ఫుల్ డిమాండ్..

ఈ ఏడాది మల్చింగ్ విధానానికి అన్నదాతలు ఆసక్తి చూపడంతో మల్చింగ్ షీట్ సామగ్రికి, షీట్ పరిచేందుకు కూలీలకు ఫుల్ డిమాండ్ ఏర్పడింది. రైతుకు మొదటి దశలోనే ఖర్చు వచ్చినా ఆ తరువాత తగ్గుతుంది. ఒక ఎకరాకు మల్చింగ్ లేకుండా మిరపలో కలుపు తీత, అరకకు, మందు వేయడం వంటి పనులకు సుమారుగా రూ.60 వేలకు పైగా ఖర్చు వస్తుంది. కానీ దీనివల్ల కలుపుతీత, ఎరువులు వేసే ఖర్చు తగ్గుతుంది. అరక దున్నే పని ఉండదు.



ప్లాస్టిక్ మల్చింగ్ పేపర్‌ను పరుస్తున్న కూలీలు

ఐలమ్మ జీవితం ఆదర్శం

చాకలి ఐలమ్మ జీవితం నేటి తరానికి ఆదర్శమని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని ప్రజాప్రతినిధులు, నాయకులు ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రజకార్లపై ఆమె సాగించిన పోరాటాన్ని గుర్తు చేసుకుని సమస్యలపై పోరాడి సాధించుకోవాలన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీలో నివాళులర్పిస్తున్న మేయర్ నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య



నేలకొండపల్లిలో నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు



ఖమ్మంవైరారోడ్: బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో..

ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఐలమ్మకు అవమానం

ఖమ్మంవైరారోడ్: పోరాడి సాధించుకున్న తెలంగాణలో పోరాట యోధులు, ప్రాణ త్యాగం చేసిన వీరులకు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో అవమానం జరిగిందని బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు అన్నారు. సాయుధ రైతాంగ పోరాట వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ 130వ జయంతి సందర్భంగా శుక్రవారం నగరంలో ఆమె విగ్రహం వద్ద నివాళులు అర్పించేందుకు వెళ్లిన బీఆర్‌ఎస్ నాయకులను అధికారులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. కలెక్టర్ వచ్చాకే దండలు వేయాలని అధికారులు స్పష్టం చేయడంతో బీఆర్‌ఎస్ నాయకులు మండిపడ్డారు. తమను అడ్డుకోవడం బలహీన వర్గాల ఆత్మగౌరవానికి భంగమని విమర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాగరాజుతో పాటు నేతలు బిచ్చాల తిరుమలరావు, మేకల సుగుణరావు, షకీనా తదితరులు మాట్లాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

ఇకపై బలహీన వర్గాల పోరాటయోధులను అవమానిస్తే జిల్లాలోని బీసీ బిడ్డలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, మక్బూల్, భోజట్ల రామ్మోహన్, వీరభద్రం, ఉస్మాన్, కందాల వీరేందర్, నెమలి కిషోర్, ఆసిఫ్, పాలే పాంగు వెంకట్, అఫ్రోజ్, మాధవి, పిట్టల తిరుమల్, ఎడ్లపల్లి నవీన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చే'జారు'తున్న పారిశుద్ధ్యం

- బురదమయంగా ప్రభుత్వాస్పత్రి ప్రాంగణం
- నిత్యం లీకవుతున్న వాటర్ ట్యాంక్
- జారిపడుతూ గాయాలపాలవుతున్న జనం

నేలకొండపల్లి: నేలకొండపల్లిలోని సామాజిక ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఒకే చోట ఆవరణలో నిర్వహిస్తున్నారు. నిత్యం ప్రతీ రోజు దాదాపు 300కు పైగా వైద్య సేవల కోసం పేషంట్లు వస్తుంటారు. కాగా, ఇటీవల ప్రభుత్వ ఆస్పత్రిలో వాటర్ ట్యాంక్ నీళ్ల లీకవుతుండడంతో ఆవరణమంతా బురదమయంగా మారుతోంది. దీనికి తోడు ఆవరణలోనే 108 వాహనం కడగడంతో మరింత బురదమయంగా మారి ఇటీవల ఆ బురదలో ప్రమాదవశాత్తు వైద్యాధికారి రాగసుధ జారిపడి తీవ్ర గాయాలపాలయ్యారు. ఈనేపథ్యాన వాహనాన్ని కడగొద్దని వైద్య సిబ్బంది చెప్పడంతో ఇంకెక్కడ కడగాలని డ్రైవర్లు ప్రశ్నిస్తుండడంతో వారి మధ్య వివాదం తలెత్తుతోంది. ఈ విషయమై 108 జిల్లా మేనేజర్ శివకుమార్‌ను వివరణ కోరగా.. అక్కడ వాహనం కడగొద్దని సిబ్బందికి చెప్పారని తెలిపారు. అలాగే సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మంగళ మాట్లాడుతూ.. డాక్టర్‌కు ప్రమాదం జరిగిన రోజు మాత్రమే తడి కాకుండా చూసుకోవాలని చెప్పినట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



బురదమయంగా మారిన ఆవరణ



ఇటీవల జారిపడిన వైద్యాధికారి

సిల్ట్ తొలగింపు పనులు పరిశీలన

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని వైరా రోడ్డులోని ప్రధాన డ్రెయినేజీల్లో సిల్ట్ (వ్యర్థాలతో కూడిన మురుగు) తొలగింపు పనులను మేయర్ పనుకొల్లు నీరజ శుక్రవారం పరిశీలించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు చేరడంతో మురుగు నీరుపోయే పరిస్థితి లేదని, ప్రతి డ్రెయినేజీలో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించాలని మేయర్ కేఎంసీ అధికారులను ఆదేశించారు. వరద, మురుగు నీరు సాఫీగా సాగేలా డ్రెయినేజీల సామర్థ్యం పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బీ.జీ. క్లెమెంట్, డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ జె.అనిల్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ ఎం.మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు భవిష్యత్‌కు సమష్టి కృషి

కూసుమంచి: విద్యార్థుల భవిష్యత్‌కు అధ్యాపకులు, తల్లిదండ్రులు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని కూసుమంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.వీరభద్రరావు అన్నారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన టీచర్స్–పేరెంట్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యతోనే పిల్లల భవిష్యత్‌కు పునాది పడుతుందని, ఆదిశగా తాము కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

తిరుమలాయపాలెం: మండలంలోని ఎదుళ్లచెరువులో పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యాన వారం రోజుల పాటు నిర్వహించిన శీతాకాల శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు సామాజిక పరిస్థితులను తెలుసుకోవాలని, సేవా భావాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. అతిథులు, వలంటీర్లు గ్రామంలో చేసిన సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ స్టేట్ కోఆర్డినేటర్ చైతన్య కిషోర్, ఎన్‌ఎస్‌ఎస్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పీఓ నారాయణరావు, గ్రామ పెద్దలు కమతం బాబు, నేరేడు సత్యం, కాంపాటి శ్రీను పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఖమ్మం అర్బన్: ఓ యువకుడు సెల్‌ఫోన్ పోగొట్టుకోగా స్థానిక పోలీసులు శుక్రవారం విచారణ చేపట్టి అందించారు. ఇటీవల డి.ఉదయ్‌కిరణ్ తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు విచారణ చేపట్టి శుక్రవారం బాధితుడికి అందించినట్లు ఖానాపురం హవేలి ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్ తెలిపారు.

ధనలక్ష్మి అవతారంలో అమ్మవారు

శ్రీదేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు ధనలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పలు చోట్ల అమ్మవారిని కరెన్సీ మాలలతో అలంకరించారు. ఆయా మండపాల వద్ద కుంకుమపూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

– సాక్షినెట్‌వర్క్



కూసుమంచి: నర్సింహులగూడెంలో అమ్మవారిని రూ.3లక్షల కరెన్సీతో అలంకరించిన భక్తులు



ఖమ్మంగాంధీచౌక్: అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



కామేపల్లి : కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు



నేలకొండపల్లి: మోటాపురంలో భక్తుల పూజలు

సారథినగర్ సమస్యలు పరిష్కరించండి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 48వ డివిజన్ సారథినగర్, మేకల నారాయణనగర్, గణేష్‌నగర్‌లలో సమస్యలు తాండవం చేస్తున్నాయని, అధికారులు దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ అన్నారు. ఈమేరకు శుక్రవారం డివిజన్‌లో సీపీఎం శాఖల ఆధ్వర్యాన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ స్తంభాలు, వీధిలైట్లు, మంచినీరు లేక, జనావాసాల మధ్య చెత్తపేరుకుపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వారి దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే మేకల బిక్షమయ్య ఫంక్షన్ హాల్ నుంచి దానవాయిగూడెం వెళ్లే రోడ్డును వెడల్పు చేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. మున్నేరుకు సైడ్‌వాల్ నిర్మించేందుకు దానవాయిగూడెం పార్కు సమీపాన కాంక్రీట్ మిక్సర్ యూనిట్ నెలకొల్పడం వలన టిప్పర్లు, డంపర్లు ఈ రహదారిపై నిత్యం తిరుగుతూ రోడ్లన్నీ ధ్వంసం అయ్యాయని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి 48వ డివిజన్‌లోని సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యాన మున్సిపల్ కార్యాలయం, కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ పాదయాత్రలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్, మెరుగు సత్యనారాయణ, స్థానిక నాయకులు తోకల బాబు, మద్దెల పుల్లారావు, పెద్దప్రోలు రామకృష్ణ, శ్రీధర్, డాక్టర్ కృష్ణారావు, హనుమంతరావు, శ్రీనివాసచారి, లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, లక్ష్మయ్య, భిక్షం, బాబు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

ఎల్‌ఆర్‌ఎస్ పరిశీలన వేగవంతం



వార్డు ఆఫీసర్లకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ వసుంధర

ఖమ్మంమయూరిసెంటర్: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు సంబంధించి ఫీజులు చెల్లించిన ప్లాట్ల యజమానులకు ప్రొసీడింగ్స్ జారీ చేసే ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వసుంధర తెలిపారు. శుక్రవారం కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలతో ఏసీపీ వార్డు ఆఫీసర్లతో సమావేశమయ్యారు. ఫీజులు చెల్లించిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారుల స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలనను వేగవంతం చేసే ప్రక్రియపై ఏసీపీ వార్డు ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. ఎల్–1 స్థాయిలో ఉన్న దరఖాస్తులను ఎలా పరిశీలన చేయాలని, వాటికి అనుమతులు ఎలా ఇవ్వాలనే అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దరఖాస్తులను పరిశీలించాలని, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

బతుకమ్మ సంబరాల్లో వివక్ష తగదు



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కేవీపీఎస్ నాయకులు

ఖమ్మంగాంధీచౌక్: బతుకమ్మ సంబరాల్లో దళిత మహిళలు స్వేచ్ఛగా పాల్గొనేటట్లు చేయాలని, వివక్ష రూపుమాపాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ముత్తమాల ప్రసాద్ కోరారు. కేవీపీఎస్ మహిళా విభాగం ఆధ్వర్యాన శుక్రవారం ఖమ్మం త్రీటౌన్‌లో నిర్వహించిన సామాజిక బతుకమ్మ వేడుకల్లో ఆయన మాట్లాడారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన బతుకమ్మ వేడుకల్లో పలుచోట్ల దళిత, బహుజనులకు ప్రవేశం లేదని, ఈ వివక్షను రూపుమాపేందుకు కులమతాలకతీతంగా సామాజిక బతుకమ్మ పేరిట సంబరాలు జరుపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు ఎస్‌కె.సైదులు, తలారి మాలతి, కోడిరెక్కల కుమారి, టి.లత, కొప్పుల రేణుక, సుంకర సత్యవతి, బెందడి లక్ష్మి, మేడిశెట్టి పద్మావతి, ఆకుల అనసూర్య, ఎం.రామ, ప్రభ, ప్రసన్న, సునీత తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంగాంధీచౌక్: లండన్‌లో ఖమ్మంవాసుల బతుకమ్మ సంబరాలు

అటెన్షన్ ప్లీజ్

నిర్లక్ష్యానికి నిదర్శనం..



మండలంలోని కామంచికల్ గ్రామ పంచాయతీ శివారు వద్ద కామంచికల్-పాటివారి గూడెం వెళ్లే ప్రధాన రహదారి పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. అసలే వర్షాకాలం కావడం, చేతికి అందే ఎత్తులో ఉండడంతో వచ్చి పోయే వాహనదారులు, విద్యార్థులు, పశువులు విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉంది. ఎటువంటి ప్రమాదం జరగకముందే విద్యుత్ శాఖాధికారులు స్పందించి డీబీ ఎత్తు పెంచడంతో పాటు చుట్టూ రక్షణ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

– ఖమ్మంరూరల్